క్లుప్తంగా

కాళ్ల పీహెచ్‌సీ తనిఖీ



ప్రసవ వార్డును పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయి

కాళ్ల: జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ గీతా భాయి కాళ్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ రికార్డులను తనిఖీ చేసి వివిధ రూములను పరిశీలించారు. వైద్య సదుపాయాలపై ఓపీకి వచ్చిన రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రసవం జరిగిన తల్లీబిడ్డను పరిశీలించి, ఆస్పత్రి సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వాసుపత్రిలో ఎక్కువ ప్రసవాలు జరిగేటట్లు ప్రోత్సహించాలని సిబ్బందికి సూచనలు చేశారు.

చలివేంద్రం ప్రారంభం



ఉండి బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

ఉండి: స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం నల్లా చారిటబుల్ ట్రస్ట్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు, ట్రస్ట్ చైర్మన్ నల్లా సత్యకిరణ్‌ప్రసాద్ ప్రారంభించారు.ఆర్టీసీ డిపో భీమవరం మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పీఎన్వీ సత్యనారాయణ,సురేష్ ముఖ్యఅతిథులుగా పాల్గొని తాగునీటిని, మజ్జిగను ప్రయాణికులకు అందించారు. కార్యక్రమంలో శశి స్కూల్ డైరెక్టర్ ఖండాపు శ్రీనివాస్, దాసరి వరదరాజు, సాయి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల ర్యాలీ



యూనియన్ బ్యాంక్ డీఎన్నార్ కళాశాల బ్రాంచ్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

భీమవరం: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయకులపై ఉగ్రవాదులు చేసిన క్రూరమైన చర్యను ఖండిస్తూ ఏఐబీఈఏ, ఏపీటీబీఈఎఫ్ పిలుపు మేరకు భీమవరంలో శనివారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీఎన్నార్ కళాశాల బ్రాంచ్ వద్ద నిరసన ర్యాలీ నిర్వహించారు. భీమవరం, పరిసర ప్రాంతాల బ్యాంక్ శాఖల నుంచి వచ్చిన ఉద్యోగులు ప్రదర్శనలో పాల్గొని ఉగ్రదాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

ఆదిత్యలో విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య



ఆదిత్య స్కూల్లో విద్యార్థులను సత్కరిస్తున్న ఆదిత్య కృష్ణంరాజు

భీమవరం: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నామని ఆదిత్య స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఆదిత్య కృష్ణంరాజు అన్నారు. ఎస్ఎస్‌సీ–2025లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఆదిత్య విద్యార్థులను శనివారం అభినందించారు. ఎం.ఎస్.ఎన్ శివాని587 మార్కులు, ఎం.శార్వాణి 585, పి.ఎస్ఎస్‌వి రామ్ నిహార్ 585, డి.ఆర్.శ్రీనిధి, ఎస్.దర్శన్‌బాబు, వై.దాక్షిణ్య 584 మార్కులు సాధించారన్నారు. 124 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని అన్నారు. అదే విధంగా ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన జి.మనస్విని, జి.హాసిని రిత్విక్‌లను సత్కరించారు. విద్యార్థులకు మెమెంటో, శాలువతో సత్కరించి, వీఐపీ ట్రాలీ బ్యాగ్ బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, బి.యుగసుధ, కేవీవీ సత్యనారాయణ, ఏయూఎల్ దుర్గాంబ పాల్గొన్నారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్-350 బైక్ ఆవిష్కరణ



న్యూ రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్ 350ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): వర్మ ఆటో మోటీవ్స్ రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్స్ భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెంలో న్యూ రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్ 350 మోడల్ బైక్‌ను శనివారం ప్రారంభించారు. భీమవరంలో వర్మ ఆటో మోటీవ్స్‌లో ఈ న్యూ మోడల్ రాయల్ ఎన్‌ఫీల్డ్ 350 బైక్‌ను భీమవరం రూరల్ ఎస్సై వీర్రాజు, సినీ నటులు రమణరెడ్డి, శ్రీగిరి, పులి రాజేంద్ర, పవన్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో షోరూమ్స్ ఎండీ మధువర్మ, ఎండీ సతీష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

సాగులో పెరుగుతున్న యంత్రాల జోరు

- వరి పంట మాసూళ్లకు యంత్రాల బాట పడుతున్న రైతులు
- మాసూళ్లకు గంటకు రూ.2,800 వసూలు
- గడ్డి కట్టలు కట్టడానికి కట్టకు రూ.35



భీమవరంలో వరికోత యంత్రంతో దాళ్వా మాసూళ్లు చేస్తున్న దృశ్యం



వీరవాసరంలో యంత్రంతో కట్టలు కట్టిన ఎండు గడ్డి

భీమవరం: దాళ్వా సీజన్‌లో వరి పంట మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తరుణంలో రైతన్నలు యంత్రాల బాట పడుతున్నారు. నాట్లు వేసే సమయంలో కొంతమంది వరినాట్లు యంత్రం ఉపయోగిస్తున్నా ఎక్కువ శాతం రైతులు కూలీలనే ఉపయోగిస్తున్నారు. ప్రధానంగా బెంగాలీ కూలీలు నాట్లు వేగంగా వేయడంతో వారితో నాట్లు వేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం పంట మాసూళ్లు మాత్రం 90 శాతంపైగా రైతులు యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. కేవలం మాసూళ్లకే కాకుండా ఎండు గడ్డి కట్టలు కట్టడానికి కూడా యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. జిల్లాలో సుమారు 2.20 లక్షల ఎకరాల్లో దాళ్వా వరినాట్లు వేయగా దాదాపు 40 శాతం పైగా మాసూళ్లు పూర్తి అయినట్లు చెబుతున్నారు.

యంత్రాలకు డిమాండ్

జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా కోత యంత్రాలు లేకపోవడంతో కొంతమంది ఇతర జిల్లాల నుంచి యంత్రాలు తీసుకొచ్చి అద్దె ప్రాతిపదికన మాసూళ్లు చేయిస్తున్నారు. ఎక్కువగా పల్నాడు, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి వచ్చిన యంత్రాలే ఇక్కడ రైతులు ఉపయోగించుకుంటున్నారు. చేలలోని మాసూళ్లు చేసిన ధాన్యాన్ని గట్టుపైకి తీసుకురావడానికి కూడా ట్రాక్టర్స్‌నే ఉపయోగిస్తున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో నాలుగు రోజులు ధాన్యాన్ని ఎండబెట్టి విక్రయాలు చేస్తున్నారు. పంట మాసూళ్లకు వరికోత యంత్రానికి గంటకు రూ. 2,800 వసూళ్లు చేస్తుండగా ఎకరాకు గంట 15 నిముషాలు పైబడి సమయం పడుతోందని రైతులు చెబుతున్నారు. ఈ విధంగా ఎకరం విస్తీర్ణంలో పంట గట్టుకు రావడానికి కోత యంత్రానికి, ట్రాక్టర్‌కు కలిపి దాదాపు రూ. 4,500 వరకు ఖర్చు అవుతున్నట్లు అంచనా.

గడ్డి కట్టలకు యంత్రాలే

వరికోత యంత్రాల ద్వారా మాసూళ్లు చేసిన పంట చేలలో గడ్డిని గతంలో ఎక్కువ మంది రైతులు నిప్పుపెట్టి కాల్చి బూడిద చేసేవారు. యంత్రాల ద్వారా కోతకోసిన పంట గడ్డిలో పోషక విలువలు ఉండవని రైతులు అపోహతో గడ్డిని పశువులకు వినియోగించేవారు కాదు. అయితే ఇటీవల పశుసంవర్థకశాఖ యంత్రాల ద్వారా మాసూళ్లు చేసిన వరిగడ్డిలోనే పశువులకు పోషక విలువలు అధికంగా లభిస్తాయని విస్తృతంగా ప్రచారం చేయడంతో రైతులు గడ్డిని వాములుగా వేసి పశువులకు దాణాగా వినియోగిస్తున్నారు. అయితే కూలీలతో గడ్డిని ఒబ్బిడి చేయడం ఎక్కువ ఖర్చుతో కూడుకున్న పని కావడంతో గడ్డిని కట్టలు కట్టడానికి యంత్రాలను ఉపయోగిస్తున్నారు. వరికోత యంత్రంతో మాసూళ్లు చేసిన గడ్డిని రెండు, మూడు రోజులు ఎండనిచ్చి తరువాత కట్టలు కట్టించి ఇంటికి తెచ్చుకుని గడ్డివాములుగా వేసి పశువులకు మేతగా ఉపయోగించుకుంటున్నారు. చేలలో గడ్డిని కట్టలుకట్టడానికి ఒక్కో కట్టకు రూ. 35 వసూళ్లు చేస్తుండగా గంటల వ్యవధిలోనే కట్టలు కట్టించి వెంటనే గడ్డివాములు వేస్తున్నారు. పని సులువుగా వేగంగా పూర్తి అవుతుండడంతో రైతులు యంత్రాల బాట పడుతున్నారు.

రేపటి నుంచి గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

భీమవరం: వేసవి సెలవుల్లో విద్యార్థులో సృజనాత్మకతను పెంపొందించడానికి పౌర గ్రంథాలయ శాఖ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించే ఈ వేసవి శిబిరంలో పిల్లలకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష , చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, డ్యాన్స్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి ఉచిత విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి బాలరాజు శనివారం ఒక ప్రకటన తెలిపారు. ఈ శిబిరం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జూన్ 6 వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బదిలీ



సూపర్‌వైజర్ దీనకుమారిని సత్కరిస్తున్న దృశ్యం

ఉండి: పబ్లిక్ హెల్త్ నర్స్‌గా వీరవాసరం పీహెచ్‌సీకి పదోన్నతిపై బదిలీ అయిన యండగండి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ కె.దీనకుమారిని పీహెచ్‌సీ డాక్టర్లు ఐసీ కీర్తన, డి.బెన్నీ సామ్యూల్స్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన వీడ్కోలు సభలో డాక్టర్స్ కీర్తన, సామ్యూల్స్ మాట్లాడుతూ దీనకుమారి సేవలను కొనియాడారు.

రఘురామకృష్ణరాజు క్షమాపణ చెప్పాలి : సీపీఎం



భీమవరంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భీమవరం: ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘు రామకృష్ణరాజు క్షమాపణ చెప్పాలని సీపీఎం శ్రేణులు హెచ్చరించాయి. శనివారం భీమవరంలో శ్రీనివాసరావుపై డిప్యూటీ స్పీకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సీపీఎం శ్రేణులు నిరసకు దిగాయి. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.వాసుదేవరావు మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యల ద్వారా సమస్యలు పరిష్కారం కావని చిత్తశుద్ధి ఉంటే సక్రమంగా సమాధానం చెప్పాలని హితవు చెప్పారు. నిరంతరం ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే సీపీఎంపై రఘురామకృష్ణరాజు చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలు బ్యాంకులకు ఎగ్గొట్టి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని పేదల ఇళ్లను కూలగొట్టడం గురువింద గింజ సామెతను గుర్తు చేస్తుందని వాసుదేవరావు ఎద్దేవా చేశారు. ఒక గ్రామంలో గుడిసెలు పీకితే తప్ప మరో ఊరిలో మంచినీళ్లు అందించలేరా? దీనినే అభివృద్ధి, ప్రజా పరిపాలన అంటారా అంటు ప్రశ్నించారు. ఉండి నియోజకవర్గంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, ఎం .ఆంజనేయులు, డి.నాగు, పులి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రంలో ఆధునికీకరణ పనులు



పెదఅమిరంలో డంపింగ్ యార్డు క్లీనింగ్ పనులు చేస్తున్న దృశ్యం

కాళ్ల: పెదఅమిరం గ్రామంలో అబ్బాయి చెరువు సమీపంలో ఉన్న సంపద తయారీ కేంద్రంలో పేరుకుపోయిన డంపింగ్ యార్డు క్రమబద్ధీకరణ, సంపద కేంద్రం ఆధునికీకరణ పనులు చేపట్టారు. శనివారం జేసీబీలతో చేపట్టిన చెత్త తొలగింపు పనులను సర్పంచ్ డి.సోమేశ్వరరావు, ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ సుమారు రూ. 5 లక్షల పంచాయతీ నిధులతో ఈ పనులు చేస్తున్నామని స్పష్టం చేశారు.

ఫార్మా రంగ అభివృద్ధికి చేయూత



విష్ణు ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రభుత్వం ఫార్మా రంగ అభివృద్ధికి చేయూతను అందిస్తుందని విశాఖ ఫార్మాసిటీ డైరెక్టర్ అండ్ సీఈఓ డాక్టర్ పీపీ లాల్‌కృష్ణ అన్నారు. భీమవరం పట్టణంలోని బీవీ రాజు ఫౌండేషన్ శ్రీవిష్ణు ఫార్మసీ కళాశాల 28వ వార్షికోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విశాఖ ఫార్మాసిటీ 2,400 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 100 ఫార్మా కంపెనీలతో ఏర్పాటైందన్నారు. ఫార్మాసిటీలో 35 వేల మంది వివిధ విభాగాల్లో పని చేస్తున్నారన్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే డ్రగ్స్‌లో పది శాతం డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌లోనే తయారవుతున్నాయని లాల్‌కృష్ణ వివరించారు. విద్యార్థులు నూతన వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకుని ఎంట్రపెన్యూర్స్‌గా మారాలని సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ టాపర్స్, ర్యాంకర్స్, గేమ్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పార్టీ ప్రతిష్టను పెంచేలా పని చేయాలి



పీవీఎల్‌ను సత్కరిస్తున్న లక్ష్మీనారాయణ

కాళ్ల: ఇటీవల నియమించిన పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను పెంచేలా పని చేయాలని వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు పిలుపు ఇచ్చారు. మండలంలోని కాళ్లకూరు గ్రామానికి చెందిన వీరమల్లు లక్ష్మీనారాయణ వైఎస్సార్ సీపీ ప్రచార విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఉండి నియోజకవర్గ ఇన్చార్జ్ పీవీఎల్ నరసింహరాజును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పివిఎల్ ను సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు పబ్లిసిటీ విభాగ అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వేగేశ్న విజయరామ రాజు, చెన్నంశెట్టి దేవివర ప్రసాద్, కొల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామివారికి చక్రస్నానం



శ్రీ వేంకటేశ్వర స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామివారి 14వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సంప్రదాయబద్ధంగా చక్రస్నానం నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు, మహా పూర్ణాహుతి, ధ్వజారోహణ నిర్వహించారు. అనంతరం శ్రీవేంకటేశ్వర స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. వందలాది మంది భక్తులు చక్రస్నానం చేశారు. అధ్యక్షుడు కంతేటి వేంకటరాజు, అర్చకులు శ్రీనివాసచార్యులు, మందిర కార్యదర్శి కుక్కల బాల, సరిపిడకల రామారావు, జానపాటి మధు, పెన్మడ శ్రీను, కడలి వేంకటేశ్వరరావు, అల్లు రామారావు, కడలి ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



క్రాస్ బండ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): వేసవిలో భీమవరం పట్టణ ప్రజలకు సమృద్ధిగా మంచినీరు అందించడానికి చర్యలు తీసుకున్నామని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం భీమవరం హెడ్ వాటర్ వర్క్స్ వద్ద పంట కాలువలు ఏర్పాటు చేస్తున్న క్రాస్ బండ్‌ను ఆయన పరిశీలించారు. అలాగే రెండు సమ్మర్ స్టోరేజి ట్యాంకులను, వాటర్ వర్క్స్‌లను పలు ప్రాంతాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో భీమవరానికి తాగునీరు అందించడానికి ముందస్తుగానే రెండు సమ్మర్ స్టోరేజి ట్యాంకులను పూర్తి స్థాయిలో నీటితో నింపామన్నారు. కాలువ మూసి వేసిన తర్వాత తాగునీటి ఇబ్బందులు లేకుండా కాలువపై క్రాస్‌బండ్ ఏర్పాటు చేస్తున్నామని, దాని నుంచి కాలువలో నీరు ఎప్పటికప్పుడు తోడుకుని ఫిల్టర్ చేసి అందిస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజినీర్ త్రినాథరాజు, డీఈ శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రోత్సాహకాల అందజేతకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుమంత్ర: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సాహకాలు అందిస్తామని జిల్లా రెడ్డి సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల లక్ష్మణరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరిట్ సాధించిన 20 మంది విద్యార్థులను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. ఈ ఎంపికలో మొదటి పది మందిని అన్ని కులాల్లోనూ మెరిట్ సాధించిన విద్యార్థులను ఎంపిక చేస్తామని, మిగిలిన పది మందిని రెడ్డికులానికి చెందిన వారిని మాత్రమే ఎంపిక చేసి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా సత్కరిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది మెరిట్ సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు మే 5 లోపు 96669 99799, 944110 11900 , 94904 33666, 7288866658 నంబర్లకు ఫోన్ చేసి తమ వివరాలను తెలియజేయాలని సూచించారు.

కవిత్వం, కథల్లో కొత్త తరాన్ని తయారు చేయాలి



కథా కుసుమాలు సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

నరసాపురం రూరల్: కవిత్వం, కథల్లో కొత్త తరాన్ని తయారు చేయాలని అందుకు గానూ ఉన్నత పాఠశాలల్లో, కళాశాలల్లో ప్రస్తుతం ఉన్న కథకులందరూ వెళ్లి యువతను సాహిత్యపరంగా చైతన్య పరచాలని ప్రముఖ కథ, నవలా రచయిత, విశ్రాంత ఉపాధ్యాయుడు నమ్మి కనక నాగేశ్వరరావు అన్నారు. శనివారం పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు కథకులు రాసిన కథల నుంచి 45 కథలను ఎంపిక చేసి కథా కుసుమాలు పేరుతో ద్వితీయ సంకలనంగా ఆవిష్కరించారు. జిల్లాల్లో పుట్టి పెరిగి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉంటున్న రచయితలంతా కలసి గతంలో ఇదే ప్రాంగణంలో కథా కిరణాలు పేరుతో మొదటి సంకలనం వెలువరించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. బాపూశ్రీ చేతుల మీదుగా కథాకుసుమాలు పుస్తకాన్ని ఆవిష్కరించగా జొన్నవిత్తుల రామచంద్రరావు సంకలనంలోని కథల గురించి సమీక్ష చేశారు. కార్యక్రమంలో పుస్తక సంపాదకులు పాకోడేటి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ యుగంలో పుస్తక ప్రచురణ ఒక యజ్ఞం అని ఈ పుస్తకం కథల ఎంపిక నుంచి ముద్రణ వరకూ పలు విషయాలను, కథల ఇతివృత్తాలను వివరించారు. అనంతరం తమ్మా సత్యనారాయణ రాసిన భక్త మార్కండేయ (పద్య నాటకం), జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి రచించిన సాక్షాత్కారం, డాక్టర్ మట్టా సుగుణరావు రచించిన ఫనల్ డయాగ్నోసిస్ నవలలను ఆవిష్కరించారు.

బస్సు సర్వీసుల రూట్ల మార్పు

నరసాపురం: మార్టేరు–పెనుగొండ రోడ్డు మరమ్మతులు, కల్వర్టు నిర్మాణం జరుగుతున్న కారణంగా నరసాపురం డిపో నుంచి రాజమండ్రి, తణుకు, నిడదవోలు వెళ్లే బస్సు సర్వీసుల రూట్లను కొన్ని రోజులపాటు మారుస్తున్నట్లు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాజమండ్రి సర్వీస్‌లు మార్టేరు, ఆచంట, ఇలపర్రు సిద్ధాంతం మీదుగా, తణుకు, నిడదవోలు బస్సులు పాలకొల్లు, మార్టేరు, ఆలమూరు, కొంతేరు, ఇరగవరం, గోపాలపురం మీదుగా ప్రయాణిస్తాయని పేర్కొన్నారు. పెనుగొండ, పెరవలి మీదుగా మరమ్మతులు పూర్తయ్యేవరకూ బస్సు సర్వీసులు నడవవని స్పష్టం చేశారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



కాంబొట్లపాలెంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: ప్రకృతి వ్యవసాయాన్ని రైతులంతా ఒక ఉద్యమంగా చేపట్టాలని ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్‌చార్జి అప్పారావు కోరారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సాహించాలని కోరుతూ రైతులతో కలసి శనివారం కాంబొట్లపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందడమే కాకుండా వాతావరణంలో అనేక సానుకూల మార్పులు వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రధానమైన నవధాన్యాల సాగుకు రైతులంతా ఉపక్రమించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా గత 10 సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు కుక్కల లీలా కుమార్‌కు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిశెట్టి మల్లిక, పంచాయతీ కార్యదర్శి కె.దివ్య రైతులు వాసంశెట్టి కేశవరావు, అనిశెట్టి ప్రసాద్, అప్పారి వీరాంజనేయులు, అనిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు



భీమవరంలో విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: విద్యార్థులు కష్టపడి క్రమశిక్షణతో చదివితే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అందిపుచ్చుకోవచ్చని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. పట్టణంలో ఇటీవల విడుదలైన జేఈఈ, ఇంటర్, టెన్త్ పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన అభినందించారు. విద్యా సంస్థలు కూడా విద్యార్థులను కేవలం మార్కుల గురించి ఒత్తిడి చేయకుండా ప్రశాంతమైన వాతావరణంలో విద్యనభ్యసించే విధంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో కోళ్ల నాగేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

తాటి ముంజెలతో వేసవి తాపానికి చెక్

- పెరుగుతున్న తాటి ముంజెల అమ్మకాలు
- పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న గిరాకీ



భీమవరం ప్రభుత్వాసుపత్రి సమీపంలో తాటి ముంజెల అమ్మకాలు చేస్తున్న దృశ్యం

భీమవరం: వేసవిలో తాటి ముంజెలకు గిరాకీ పెరుగుతుంది. వేసవి తాపాన్ని తట్టుకోడానికి అనేక మంది తాటిముంజెలు తింటూ ఉంటారు. తాడిచెట్లు నుంచి లభించే తాటికాయలను తెచ్చి పట్టణాలు, గ్రామాల్లో సైతం జోరుగా విక్రయిస్తున్నారు. వేసవి ఎండల తీవ్రత నుంచి ఉపశమనానికి మానవాళికి ప్రకృతి ప్రసాదించిన వరం తాటి ముంజెలు అని నిపుణులు చెబుతున్నారు. వేసవి సీజన్లో మాత్రమే దొరికే వీటిని విక్రయిస్తూ ఎంతోమంది జీవనోపాధిని పొందుతున్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు మాత్రమే అందుబాటులో తాటిముంజెలు ప్రస్తుతం అన్ని ప్రాంతాలతో లభిస్తున్నాయి. ప్రధాన రహదారుల వెంబడి గుట్టలుగా తాటికాయలు వేసి అప్పటికప్పుడు తాటి ముంజెలు తీసి విక్రయాలు చేస్తున్నారు. దీనితో వివిధ వాహనాలపై వెళ్లే బాటసారులకు దారిపొడవునా లభిస్తున్నాయి. గతంలో వేసవి సెలవుల్లో రైతుల పిల్లలు, బంధువులు, స్నేహితులు సరదాగా పొలాలకు వెళ్లిన తాడిచెట్ల నుంచి తాటికాయలు కోయించి ముంజెలు తినేవారు. ఆధునిక కాలంలో పిల్లలు పొలాలకు వెళ్లి, తీరుబడిగా ముంజెలు తినే తీరిక ఎవరికీ ఉండడం లేదు. అందువల్ల తాటి ముంజెలను కొనుగోలు చేసి తినడానికి ప్రాధాన్యమిస్తున్నారు.

పోషక విలువలు అధికం

కొబ్బరి బొండాలతో పాటు తాటిముంజెలు అనేక పోషకాలను అందిస్తాయని వైద్యులు చెబుతున్నారు. వంద గ్రాముల తాటి ముంజెలో 92.5 గ్రాముల తేమ, 6.4 గ్రాముల కార్బోహైడ్రేటులు, 06 గ్రాముల ప్రొటీన్లు, 0.2 గ్రాముల పీచు పదార్థాలు, 0.1 గ్రాము కొవ్వు, 6.1 మిల్లీ గ్రాముల ఆమ్లం, 12 మిల్లీగ్రాముల కాల్షియం, 21 మిల్లీ గ్రాముల పాస్ఫరస్, 0.3 మిల్లీ గ్రాముల ఇనుప ధాతువు ఉంటాయి. తాటి ముంజెలు తినడం వల్ల వేసవి తాపం తీరడంతో పాటు శరీరానికి అవసరమైన క్యాలరీలు లభిస్తాయి. అంతేకాక వీటిని ముఖానికి ఫేస్‌ప్యాక్‌గా కూడా ఉపయోగిస్తుంటారు. ఈ విధంగా చేస్తే ముఖంలో అలసట పోవడమేగా మొటిమలు, నల్లమచ్చలు కూడా తగ్గుతాయని వైద్యులు చెబుతున్నారు.

ఈ ఏడాది జనవరిలోనే ముంజెలు

సాధారణంగా తాటికాయలు వేసవి సీజన్‌లోనే లభిస్తాయి. అంటే మార్చి నెల నుంచి జూన్ నెల వరకు అందుబాటులో ఉంటాయి. ఆ తర్వాత తాడిపండ్లు దొరుకుతాయి. అయితే ఈ ఏడాది జనవరి నెలలోనే తాటికాయలు కాయడంతో అప్పటి నుంచే తాటి ముంజెలు అమ్మకాలు ప్రారంభించారు. ప్రధాన రహదారుల వెంబడి, పట్టణాల్లోని వివిధ కూడళ్లలో కొంతమంది తాటిముంజెలు అమ్మకం ద్వారా ఉపాధి పొందుతున్నారు. ప్రధానంగా ఆసుపత్రులకు దగ్గరలో వీటి అమ్మకాలు వేగంగా సాగుతున్నాయి. తాటికాయలను కోసి ముంజెలను కవర్లలో వేసి విక్రయాలు చేస్తున్నారు. కొంతమంది అక్కడికక్కడే కోసి అమ్మకాలు చేస్తుండగా మరికొంతమంది వేరే ప్రాంతంలో ముంజెలు తీసి కవర్స్‌లో వేసి గంపల్లో తెచ్చి అమ్మకాలు చేస్తున్నారు. 15 ముంజెలను రూ. 50 వరకు విక్రయిస్తున్నారు.